పేదల గూడుపై నిర్లక్ష్యం

- ప్రశ్నార్థకంగా ఇళ్ల నిర్మాణం
- ఆగిన గృహాలకు మోక్షం ఎప్పుడో..!
- ప్రకటనలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం
- వసతుల గురించి పట్టించుకోని వైనం

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేయడంతోపాటు నిర్మాణాలకు ప్రోత్సహించారు. అయితే కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోవడం లేదు. ఇక వసతులను గాలికొదిలేసింది.

మండలంలో..	
లేఅవుట్లు	:14
ఇళ్ల స్థలాల అందుకున్న లబ్ధిదారులు	:రెండు వేలు


మనుబోలు మండలంలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

మనుబోలు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. ఊరూరా అందుబాటులో ఉన్న ఖరీదైన స్థలాలను కొనుగోలు చేసి మరీ లేఅవుట్లు మహిళలకు అందజేసింది. మండలంలో రెండు వేల మంది లబ్ధిదారులు స్థలాలు అందుకున్నారు. వారు గృహాలను కట్టుకునేందుకు నాటి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. వివిధ దశలను బట్టి నగదును అందజేసేవారు. సొంతంగా ఇల్లు కట్టుకోలేని వారి కోసం కాంట్రాక్టర్లను ఏర్పాటు చేశారు.

ఇప్పుడిలా..

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోవడం మానేసింది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నేటి సర్కారు వసతులు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మనుబోలు హైవేకు కూతవేటు దూరంలో ఉన్న కాలనీకి వెళ్లేందుకు ప్రస్తుతం దారి కూడా సక్రమంగా లేదు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు, ఇళ్లలోని వృథా నీరు వెళ్లే దారి లేక నిల్వ చేరిపోతోంది. వీధి లైట్లు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి బోర్లు మూడు ఉండగా ప్రస్తుతం ఒకటే పనిచేస్తోంది. దారి గుంతలమయంగా ఉంది. వర్షం కురిస్తే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. ఎక్కడ చూసినా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయి నివాసం ఉండలేని విధంగా మారింది. అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం మిగిలిన నిర్మాణాలు, వసతుల గురించి పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


ఇళ్ల మధ్యలో నిల్వ చేరిన వర్షపునీరు


అధ్వానంగా దారి

భయంగా ఉంటుంది



వర్షం కురిస్తే ఇంటి చుట్టూ నీరు నిల్వ చేరుతుంది. వీధి లైట్లు కూడా లేవు. అప్పుడప్పుడూ పాములు ఇంటి ఆవరణలోకి వస్తున్నాయి. చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో రాత్రయితే భయంగా ఉంటుంది.

– కంటిపల్లి కృష్ణమ్మ, కాలనీ వాసి

వసతులు కల్పించండి



కాలనీలో వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయి. తాగునీటి మోటార్ ఒకటే అందుబాటులో ఉంది. అది మరమ్మతులకు గురైతే దగ్గరలో తాగునీరు కూడా దొరికే పరిస్థితి లేదు. చేతి బోర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కాలనీకి వచ్చే దారి గుంతలమయంగా ఉంది. వసతులు కల్పించాలి.

– పారి అనిత, కాలనీ వాసి

సమస్యలు పరిష్కరిస్తాం



కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ చేశారు. అది పూర్తయ్యాక పనులను వేగవంతం చేస్తాం.

– భాస్కర్‌రావు, హౌసింగ్ ఏఈ

క్లుప్తంగా

బాబా మందిరాల్లో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి పల్లకి సేవ జరిగింది.

- మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ బాబా విగ్రహానికి పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

'దౌర్జన్యం చేస్తున్నారు'

- వృద్ధ దంపతుల ఆవేదన


మాట్లాడుతున్న వృద్ధ దంపతులు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పొలం విషయంలో దౌర్జన్యం చేస్తున్నారని మండలంలోని పంచేడు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వారు వివరాలు వెల్లడించారు. పంచేడుకు చెందిన సాయిబాబా– సత్యభామ వృద్ధ దంపతులకు గ్రామంలో 2.50 ఎకరాల భూమి ఉంది. ఇదే గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి, వైజయంతమ్మ వారి కుమార్తె వివాహం కోసమని తమ భూమిని రాయించుకుని మోసం చేశారని వాపోయారు. దీనిపై గ్రామపెద్దల సమక్షంలో చర్చ జరిగినప్పుడు రఘురామిరెడ్డి తన భూమిని 84 సెంట్లు వృద్ధులకు రాసిచ్చాడు. మరో ఎకరా భూమి రఘురామిరెడ్డి దత్త పుత్రుడు సురేంద్రరెడ్డికి రాసిచ్చారు. అయితే ఇటీవల రఘురామిరెడ్డి చనిపోయారు. అప్పటి నుంచి అతని భార్య, అల్లుడు, కుమార్తె కలుసుకొని వృద్ధులకు రాసిచ్చిన భూమి, దత్త పుత్రుడికి రాసిచ్చిన భూమి తమదేనంటూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా తమపైనే కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని వృద్ధదంపతులు కోరుతున్నారు.

మర్యాదపూర్వకంగా..


పూల మొక్కను అందజేస్తున్న నాయకులు

కోవూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో కొడవలూరు మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. పెమ్మారెడ్డిపాళెం సర్పంచ్ వల్లాపురం నవీన్, ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు మెంబర్ బండ్ల శీనయ్య, జానా శ్రీనివాసులు, రామన్నపాళెం నాయకులు నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, కారంపూడి సుబ్బరామిరెడ్డి, కరేటి శ్యామ్ సుందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

'నాస్' పరీక్షతో సామర్థ్యాల అంచనా


నాస్ ప్రాక్టీస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

కొడవలూరు: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్షతో చిన్నారుల విద్యా సామర్థ్యాలను అంచనా వేస్తామని ఎంఈఓ జి.వసంత కుమారి తెలిపారు. వచ్చే నెల 4న జరిగే నాస్ పరీక్షకు మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్లో ఆరో తరగతి, రామాపురం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి ఎంపికయ్యాయి. ఈ రెండు పాఠశాలల్లోని ఆరు, మూడు తరగతుల విద్యార్థులకు నాస్ మోడల్ ప్రశ్నపత్రంతో ప్రాక్టీస్ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రాక్టీస్ పరీక్షను గురువారం ఆమె పరిశీలించారు. తొలి విడతలో మండలంలోని రెండు పాఠశాలల్లో రెండు తరగతులు ఎంపికై ఒదన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయంలో భజనలు

బుచ్చిరెడ్డిపాళెం: అయ్యప్ప భక్తులు స్థానిక శివాలయంలో గురువారం భజన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 3 గంటల పాటు భజనలు, పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి కాకాణి పరామర్శ


నివాళులర్పిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మండలంలోని పోలంరాజుగుంట గ్రామంలో గురువారం మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అత్త దువ్వూరు లీలావతమ్మ బుధవారం మృతిచెందారు. కాకాణి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం చంద్రశేఖరరెడ్డిని, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, దువ్వూరు నిరంజన్‌రెడ్డి, దువ్వూరు కోదండరామరెడ్డి, సుబ్బరామరెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్లపల్లిలో నేత్రదానం


రావుల సంపూర్ణమ్మ(ఫైల్)

విడవలూరు: మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన రావుల సంపూర్ణమ్మ (85) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆమె నేత్రాలను మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమక్షంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు ఆమె నేత్రాలను సేకరించారు.

30న పింఛన్ల పంపిణీ

మనుబోలు: ఈనెల 30 తేదీన పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు ఈ విషయాన్ని లబ్ధిదారులకు ముందుగా తెలియజేయాలని సూచించారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. ఈనెల 26, 27 తేదీల్లో వీఎస్‌యూ, కావలిలో నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ పురుషుల క్రీడా పోటీల్లో వర్సిటీ విద్యార్థులు టగ్ ఆఫ్ వార్‌లో ప్రథమ, బాల్ బాట్మింటన్‌లో ద్వితీయ, యోగాలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని గురువారం ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ ఆసక్తి చూపి రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకటరాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం, విరువూరు, తాటిపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని పొదలకూరు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదూరుపల్లి 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లి ప్రసన్నకుమార్ తండ్రి మల్లి శంకర్‌రావు ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి నెల్లూరులోని వారి నివాసానికి గురువారం వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కొడవలూరు మండలం గండవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత అడపాల మోహన్‌కృష్ణ తమ్ముడు అడపాల రామ్‌ప్రసాద్ పెద్దకర్మ కార్యక్రమంలో ప్రసన్న పాల్గొన్నారు. దేవిరెడ్డి సాయిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


కొడవలూరులో..


పాపిరెడ్డిపాలెం గ్రామంలో..

కొడవలూరు: మండలంలోని కొడవలూరులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కోవూరు ఏడీఏ డి.సుజాత మాట్లాడుతూ వరి నారుమడిలో మెళకువలు అవసరమని సూచించారు. రైతులంతా కూడా వేప నూనె వరిలో పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏలు జి.కవిత, మహేష్, రైతులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు: వరి సాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో గురువారం పొలం బడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సాగుకు ముందు విత్తన శుద్ధి చేపడితే వరిలో చీడ పీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వీఏఏ షర్మిల, దయానా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన


పాల్గొన్న భక్తులు

పొదలకూరు: కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం రాత్రి సహస్ర దీపారాధనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు దీపాలను వెలిగించి బాబాను దర్శించుకున్నారు. పూజా సామగ్రిని మందిర సేవా సమితీ సొసైటీ సమకూర్చింది. 18 సంవత్సరాలుగా సహస్ర దీపారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ చీమకుర్తి రాజగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, కార్యదర్శి నాగిశెట్టి దామోదరం, సభ్యులు లక్కాకుల ఆనందరావు, తుమ్మల శ్రీనివాసులు, కె.కోటేశ్వరరావు, సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌పై దురుసు ప్రవర్తన బాధాకరం


ఈఓపీఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు, సర్పంచ్

విడవలూరు: మండలంలోని ముదివర్తి దళిత సర్పంచ్ నిర్మలమ్మ పట్ల స్థానిక కార్యదర్శి కె.శ్రీనివాసరావు దురుసుగా ప్రవర్తించడం బాధాకరమని బీఎస్పీ నాయకుడు ఎల్లు సాల్మన్‌రాజ్, జిల్లా ఇన్‌చార్జి బి.శ్రీరామ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం దళిత సంఘాల నాయకులతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ నిర్మలమ్మకు వార్డు మెంబర్ల మద్దతు లేదని, రూ.50 వేలు ఇస్తే బిల్లుకు ఆమోదం తెలుపుతానని, లేదంటే చెక్ పవర్ రద్దు చేస్తానని కార్యదర్శి శ్రీనివాసరావు బెదిరించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈఓపీఆర్డీ మస్తాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కట్టుమంచి అరుణ, జిల్లా కార్యదర్శి కె.కిశోర్, పల్లం శేషమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి


పొదలకూరులో..


విడవలూరు డిగ్రీ కళాశాలలో..

పొదలకూరు: జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న పూలే భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ పూలే పూల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పముజుల శంకరయ్య, తుమ్మల శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సిద్దయ్య, రఘురామయ్య, సుధాకర్, కోడూరు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

- విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ బి.సుజాత ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ అధ్యాపకుడు మేరుగ మధుసూదన్‌రావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, హిస్టరీ అధ్యాపకుడు ఎం.వెంకటరమణారావు పాల్గొన్నారు.

సాగునీటి కాలువపై రియల్ పంజా

- దర్జాగా లేఅవుట్ల నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు


రేబాల కాలువపై ఉన్న తాటిచెట్లను తొలగిస్తున్న జేసీబీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీగా అవతరించిన తర్వాత భూముల రేట్లు భారీగా పెరిగాయి. ఇది రియల్ వ్యాపారులకు వరంగా మారింది. పట్టణం, గ్రామీణం అనే తేడా లేకుండా ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ ఇష్టారాజ్యంగా, ఎలాంటి అనుమతుల్లేకుండా లేఅవుట్లు నిర్మించి రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని రేబాల సాగునీటి కాలువను కూడా ఆక్రమించి లేఅవుట్ నిర్మించారు. దీంతో రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రేబాల గ్రామంలో కాలువ సమీపంలో ఓ రియల్ సంస్థ లేఅవుట్ నిర్మాణం కోసం కాలువను తవ్వేశారు. కాలువపై ఉన్న వందల తాటిచెట్లను జేసీబీతో తొలగించారు. దీనిపై సమీప రైతులు, గీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువపై ఉన్న తాటిచెట్లను తొలగించడం వల్ల కాలువ దెబ్బతిని సాగునీరు వృథాగా పోతోందని, తమకు జీవనాధారమైన తాటిచెట్లను ఇష్టారాజ్యంగా తొలగించడం సరికాదని గీత కార్మికులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా నామమాత్రంగా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు అంటున్నారు.

కనీస చర్యలు కరువు

రియల్ వ్యాపారులు నిత్యం కాలువలు, కుంటలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇష్టారాజ్యంగా అనుమతుల్లేని లేఅవుట్లు నిర్మిస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఇలాంటి వాటిని పరిశీలించాల్సిన ఇరిగేషన్ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్లు సమీప దూరంలో ఉన్న కాలువలను ఆక్రమించి నిర్మించినవే. ఇలాంటి వాటిపై పర్యవేక్షించాల్సిన అధికారులు రియల్ వ్యాపారుల నుంచి ముడుపులు అందడంతో ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు అంటున్నారు. జిల్లా అధికారులైనా స్పందించి బుచ్చిలో రెచ్చిపోతున్న రియల్ వ్యాపారులపై, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటా

రేబాల కాలువ ఆక్రమణ నా దృష్టికి రాలేదు. నేను ఇటీవల బాధ్యతలు తీసుకున్నా. పరిశీలించి చర్యలు తీసుకుంటా.

– శ్రీనివాసులు, ఏఈఈ, కోవూరు


కాలువ పక్కన లేఅవుట్